విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఆర్కేకు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-మంగళగిరి : స్థానిక ఎమ్మెల్యే ఆళ్ళ రామ కృష్ణారెడ్డి జన్మదిన సందర్భంగా మంగళగిరి ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఎమ్మెల్యే ఆర్కేని నిడమర్రు టిడ్కో గృహాల వద్ద కలిసి పుష్ప గుచ్చం, మొక్కను ఎమ్మెల్యే ఆర్కేకు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నందం వీరాంజనేయులు(బుజ్జి), గోలి శివకుమార్, అధ్యక్షుడు మర్రెడ్డి శివనాగి రెడ్డి, ఉపాధ్యక్షులు పడాల అనిల్ కుమార్, కార్యదర్శి కొండా అభిరామ్ కృష్ణారెడ్డి, కోశాధికారి పల్లె ప్రకాష్, సహాయ కార్యదర్శి చింతపల్లి కన్యాకుమార్, కమిటీ మెంబర్ కాజా పున్నారావు, ప్రసాద్, యూనియన్ సభ్యుడు నూతలపాటి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కన్వెన్షనల్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎండీ ఫయాజ్ అహ్మద్‌కు అలహాబాద్‌లోని మోతిలాల్ నెహ్రూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'డెవలప్‌మెంట్ ఆఫ్ స్మార్ట్ క్వాడ్‌కాప్టర్ ఫర్ ఇన్‌స్పెక్షన్ ఆఫ్ ఓవర్‌హెడ్ పవర్ ట్రాన్స్ మిషన్ లైన్స్' అనే అంశంపై పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు ఎన్‌ఐటీ అలహాబాద్‌లోని మెకానికల్ డిపార్ట్‌మెంట్ అసోసి యేట్ ప్రొఫెసర్ జేసీ మొహంతా గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈయన తన పరిశోధనలో భాగంగా మొత్తం 4 ఎస్‌సీఐ, 1 ఈఎస్‌సీఐ జర్నల్ పబ్లికేషన్స్, 3 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని తెలియజేసారు. పీహెచ్‌డీ పట్టా పొందిన ఎండీ ఫయాజ్ అహ్మద్‌ను విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఎరుకుల సమాజాభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-గుంటూరు : ఇతిహాసాల నుంచి స్ఫూర్తిదాయకమైన సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎరుకల సమాజం స్వాతంత్ర అనంతరం విద్యా పరంగా, సామాజికంగా, రాజకీయపరంగా అత్యంత వెనుకబడ్డ జాతిగా ఉన్నదని ఏపీ ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఛైర్మన్ పాలపర్తి శ్రీనివాసరావు అన్నారు. ఎరుకుల సమాజాభివృద్ధి కృషి చేస్తామని చెప్పారు. జిల్లా ఎరుకుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన మేడా గోపితో పాటు 40 మంది ఇతర కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార సభ స్థానిక బ్రాడీపేటలోని ఒక హోటల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివా సరావు మాట్లాడుతూ విద్య ద్వారానే ఎరుకల సమాజ ఎదుగుదలతో పాటు సామాజిక, రాజకీయ ఎదుగుదల సాధ్యమని గ్రహించాలన్నారు. నూతన అధ్యక్షులు మేడా గోపి మాట్లాడుతూ గతంలోనే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎరుకల సమస్యల పరిష్కారానికి కృషి చేశామని అదే స్ఫూర్తితో జిల్లాలోని ఎరుకల సమాజాభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని వాగ్దానం చేశారు. పి.శ్రీనివాసరావు, పాలకుర్తి శ్రీనివాసులు, జయలక్ష్మి, యాద ఎ జాలగిరి లీలా శంకర్, అమాసు శ్రీరాములు, ఎం.వెంకట కృష్ణ, ఏడుకొండలు, టైగర్ శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

ఇస్లాంపేట మర్కస్ మసీదుకు లక్ష విరాళం

విశాలాంధ్ర-తెనాలి : తనకు అధికారం ఉన్నా లేకపోయినా తాను జీవించి ఉన్నంతకాలం ప్రతి సంవత్సరం తెనాలి ఇస్లాంపేటలోని మర్కస్ మసీదుకు లక్ష రూపాయలు ఇస్తానని 15 యేళ్ల క్రితం ఇచ్చిన మాటననుసరించి ఈ రంజాన్ మాసంలో బుధవారం లక్ష రూపాయల చెక్కును మాజీ మంత్రి రాజేంద్రప్రసాద్ కమిటీ వారికి స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు 18వ వార్డు కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని మసీదు అభివృద్ధిపై రాజాకు ఉన్న వితరణను నిబద్ధతను కొనియాడారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆర్కే జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో 14వ వార్డు ముగ్గురోడ్డు ఎంపీయూపీ స్కూల్‌లో బుధవారం వైసీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల రెడ్డి, సోమిరెడ్డి ముఖ్యఅతిధులుగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, జిల్లా సోషల్ మీడియా మేకా వెంకటరామి రెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు(పండు), బత్తుల దాసు, చిలుకోటి శ్రీనివాస్, మధు, యు.శ్రీను, కొండా, ఉదయ్ రాజు, జోషి, రవి, ప్రభాకర్, తిరుపతమ్మ, నానీ, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ **కొల్లిపర బోడియ్య** గారి కుమారుడు **కొల్లిపర ప్రసాద్** గారి వద్దనుండి సమాచారం పొంది, యావన్మందికి తెలియజేయునది ఏమనగా

నా క్లయింట్ **కొల్లిపర బోడియ్య** గారి కుమారుడు **కొల్లిపర ప్రసాద్** గారు అంకిరెడ్డిపాలెం గ్రామము **తాలూకు సర్వే నెంబర్: 188 లోని 282-46 చ.** గజముల భారీ నివేశన స్థలమును షేక్ నాగుల్ మీరా గారి కుమారులు షేక్ అబ్దుల్ ఖుద్దూస్ మరియు షేక్ మొహమ్మద్ అలీ గార్ల వద్ద నుండి దిగువ షెడ్యూల్ దాఖలు ఆస్తిని కొనుగోలు చేయుటకు **ది: 02-03-2023**న అగ్రిమెంట్ పొందియున్నారు. సదరు ఆస్తిని షేక్ నాగుల్ మీరా గారి కుమారులు **1. షేక్ అబ్దుల్ ఖుద్దూస్ మరియు 2. షేక్ మొహమ్మద్ అలీ గార్లు దస్తావేజు నంబర్లు: 8100/2007 & 8102/2007** ద్వారా కొనుగోలు చేసి యున్నారు. దిగువ షెడ్యూల్ ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నా క్లెయిమ్స్ ఉన్నా ఈ రోజు నుండి పది దినములలో నాకు గాని నా క్లయింట్‌కు గాని తెలియ జేయగలరు. ఎటువంటి అభ్యంతరములు రానిచో షెడ్యూల్ ఆస్తిని నిష్పేచి ఆస్తిగా భావించి నా క్లయింట్ విక్రయ దస్తావేజు వ్రాయించుకోగలరు.

తూర్పు : షేక్ మహబూబ్ సుభాని గారి స్థలము-43 అ

దక్షిణం: కొణతం కోటయ్య గారి స్థలము 61.8 అ

పడమర: 20 అడుగుల వెడల్పు రోడ్డు - 43 అ

ఉత్తరం: 1. షేక్ అబ్దుల్ ఖుద్దూస్ మరియు 2. షేక్ మొహమ్మద్ అలీ గార్ల నివ్వ స్థలము - 56.3 అ

ఈ హద్దుల మధ్య 282-463. గజములు లేదా 236-16 చ, మీ ఖాళీ నివేశన స్థలము.

ఏలూరి మల్లికార్జునరావు, అడ్వకేట్

D.No. 3-28-18/95-1, Nagarjuna Street.

7th Line. Brundavan Gardens,

Guntur - 522006

Cell No : 9440249055

సచివాలయాల పనితీరును పర్యవేక్షించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు మెరుగుపర్చటంలో, పర్యవేక్షణలోను నిర్లక్ష్యం వహించే ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సబ్ కలెక్టర్‌బీ ఆర్డీవో, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహాశీల్దార్లు, ఎంపీడీవోలు, మెడికల్ ఆఫీసర్లు, ఎంఈవోలు, హౌసింగ్, పంచాయితీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాలను మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు జరిగేలా సచివాలయ ఉద్యోగులకు సూచనలు అందించాలన్నారు. ప్రభుత్వ సేవలు తక్కువగా ఉన్న సచివాలయాలపై ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి సేవలు తక్కువగా రావటానికి ఉన్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కన్సిస్టమ్ రిథమ్స్‌లో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలను సంబంధిత సచివాలయ ఉద్యోగులు ప్రతి నెల తనిఖీలు నిర్వహించేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ రామిరెడ్డి, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, డీఎంహెచ్ఓ డా. శ్రావణబాబు, సీపీవో శేషశ్రీ, వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారిణి సుజాత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో జగన్‌కు చోటులేదు

విశాలాంధ్ర-గుంటూరు : నాలుగేళ్లుగా రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిన జగన్‌కు ప్రజల గుండెల్లో స్థానం లేదని, అందుకే ఇప్పుడు ఇంటి గోడల మీదకి చేరాడని, రానున్న రోజుల్లో చెత్తకుప్పల్లోకి చేర్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. మంగళవారం శ్రీనివాసరావుతోటలోని పీర్లచావిడి సెంటర్‌లో జగనన్నే నీతో భవిష్యత్ లేదు - నీపై నమ్మకమూ లేదు అంటూ స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ప్రజల్లో నమ్మకం కోల్పోవడంతో స్టిక్కర్ల పేరుతో నన్ను నమ్మండి నన్ను నమ్మండి అంటూ జగన్ ప్రజల్ని వేడుకుంటున్నారని విమర్శించారు. నాలుగేళ్లుగా జగన్ పరిపాలనతో విసిగిపోయిన ప్రజలు జగన్ పేరు చెబితేనే చీదరించుకుంటున్నారని, స్టిక్కర్లు అతికించినా, గోడలకు సున్నాలు వేసినా వైసీపీని నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. స్టిక్కర్లు వేసేముందు ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలన్నారు. రాజధాని నిర్మించి, పోలవరం కట్టి, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి, దశలవారీ మద్యనిషేదం విధించి, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించి, దళితులపై జరుగుతున్న హత్యలను, ఆడపిల్లలపై జరుగుతున్న హత్యాచారాలను నిలువరించి, గంజాయి, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలను అరికట్టి, సీపీఎస్ రద్దు చేసి, చనిపోయిన కౌలు రైతుల కుటుంబాలను ఆదుకొని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు భద్రత కల్పించి, సామాజిక కార్పొరేషన్లకు నిధులు కేటాయించి, దెబ్బతిన్న రోడ్లను నిర్మించి, పెంచిన విద్యుత్, బస్ చార్జీలు తగ్గించి, చెత్త పన్ను ఎత్తివేసి ఇలా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాకే స్టిక్కర్లను అతికించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బండారు రవీంద్ర, రామిశెట్టి శ్రీను, బాషా, కోనేటి ప్రసాద్, ఉదయ్, టర్జాన్, నందూరి స్వామి, బద్రిశెట్టి రాంబాబు, సోమి ఉదయ్, చిన్న, బాలాజీ, వడ్డె సుబ్బారావు, అలీ తదితరులు పాల్గొన్నారు.

24,501 మంది లబ్ధిదారులకు ఈబీసీ నేస్తం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఈబీసీ నేస్తం క్రింద 24,501 మంది ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల పేద మహిళకు రెండవ విడతగా 2022-23 సంవత్సరానికి రూ.36,75,15,000లు ఆర్థిక సాయం అందిస్తారని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి వైయస్సార్ ఈబీసీ నేస్తం ఆర్థిక సాయాన్ని వర్చువల్ విధానం ద్వారా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమంలో గుంటూరు కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, మార్కెటింగ్ శాఖ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి, డీఆర్వో చంద్రశేఖర రావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, లబ్ధిదారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈబీసీ నేస్తం ద్వారా 45 నుండి 60 ఏళ్ళలోపు ఉన్న రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ వర్గాలకు చెందిన పేద మహిళలకు వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు రెండవ విడత ఆర్థిక సాయం చెక్కును అందించడం జరిగింది.

పతకాల బహుకరణకు రూ.లక్ష చెక్కు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హిందూ ఫార్మసీ కళాశాల ఫార్మకాలజీ విభాగంలో ఉత్తమ ర్యాంకు పొందిన విద్యార్థులకు బంగారు పతకం బహుకరించే నిమిత్తం వజ్జా భార్గవి నాగలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, ఏఎన్‌యూ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వజ్జా రంగారావు, కార్యదర్శి శేషారత్నంలు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ డాక్టర్ ఎస్. మధుసూధనరావులకు లక్ష రూపాయల చెక్కును బుధవారం అందజేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. ప్రొఫెసర్ రంగారావు మాట్లాడుతూ 1999లో తమ కుమార్తె భార్గవి నాగలక్ష్మి విజయవాడలోని కెవీఎస్ఆర్ సిద్ధార్థ కళాశాలలో బీ.ఫార్మసీ, 2001లో ఆంధ్ర యూనివర్శిటీలో ఎం.ఫార్మసీలో ప్రథమ స్థానం సంపాదించి హైదరాబాద్‌లోని ప్రముఖ ఔషధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో సైంటిస్ట్‌గా పని చేస్తూ స్వర్గస్తులైన నేపథ్యంలో ఆమె జ్ఞాపకార్థం విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులను ప్రోత్సహించటానికి విరాళం అందజేసిన ట్రస్ట్ ప్రతినిధులకు రంగరాజు, డాక్టర్ మధుసూధనరావులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మాస్యూటికల్స్ హెచ్ఓడీ డాక్టర్ ఎ.సీతాదేవి, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ పేదలకు సహాయపడాలి

విశాలాంధ్ర-గుంటూరు : పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు ధానధర్మాలు చేయడం అల్లాకు అత్యంత ఇష్టదాయకమని పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. గుంటూరు నగరంలోని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి గృహంలో పేద ముస్లింకు రంజాన్ తోఫాను బుధవారం అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ఇస్లాం ధర్మాన్ని అందరూ ఆచరించి పేదలకు సహాయపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్, మస్తాన్ వలి సోదరులు ఖాసీం షరీఫ్, చిన్న మస్తాన్ వలి, కుటుంబ సభ్యులు జాని బాషా, ముఫ్తీ జావిద్ సాబ్, ముఫ్తీ ముజాహిద్ సాబ్, ముఫ్తీ ఇస్మాయిల్ జాబివుల్లా, మౌలానా మున్వర్ సాబ్, పార్టీ నాయకులు గద్దం పాల్ విజయ్ కుమార్, జక్కా శ్రీనివాస్, అంబటి రత్తయ్య, సందీప్, పవన్ తేజ, సుధీర్ బాబు, చెన్నంశెట్టి సాంబశివరావు, సయ్యద్ జాని గోల్డ్, కరీమ్, బాబు రావు, మల్లెల మోషే, వాల్మీకి శ్రీనివాస్, దేవరపు శ్రీనివాస్, బోడపాటి శ్రీను, మల్లవరపు చిన్న, రెహమాన్, హద్దు, బుజ్జి, భాగ్యరాజ్, నూరుల్లా, మెఘనాద్, బాజి, ప్రసాద్, జాని టోపి పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ సంస్థల సాధికారతకు కట్టుబడి ఉంది

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశంలోని పంచాయతీ రాజ్ సంస్థల సాధికారతకు అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) కట్టుబడి ఉందని అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పేర్కొన్నారు. అఖిల భారత పంచాయితీ పరిషత్ 65వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఉన్న కార్యాలయంలో 'పంచాయితీ పరిషత్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు' జాస్తి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్వంత్‌రామ్ మెహతా చిత్ర పటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరంమాట్లాడుతూ పంచాయతీరాజ్ సంస్థలు గ్రామీణ వ్యవస్థలో ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలు అని అన్నారు. దేశంలోని పంచాయితీ రాజ్ సంస్థల బలోపేతానికి బల్వంత్‌రాయ్ మెహతా, భారత రత్న జయప్రకాష్ నారాయణ విశేష కృషి చేశారని కొనియాడారు. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని రూపొందించడంలోనూ... పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో అఖిల భారత పంచాయితీ పరిషత్ కీలక భూమిక వహించిందని పేర్కొన్నారు.

పన్ను చెల్లింపుదారులకు గడువు పెంపు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వార్షిక రిటన్స్ పన్ను చెల్లింపుదారులకు అపరాధ రుసుము గడువు పెంచుతున్నట్లు గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్‌కి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక లేఖ పంపినట్టు గుంటూరు ఎంపీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత పార్లమెంట్ సమావేశాల్లో గల్లా జయదేవ్ వార్షిక నివేదికలైన జీఎస్టీఆర్-9, 9సీ4 మొదలగు వాటికీ ఆలస్య రుసుములు లేకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నోటిఫికేషన్ లేకుండా వ్యాపారస్తులకు ఆలస్య రుసుము నోటీసు ఇస్తున్నారని కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని పరిమితుల మేరకు వర్తింప చేయమని కౌన్సిల్‌ని ఆర్థిక శాఖ ద్వారా కోరారు. 377 కింద వార్షిక రిటర్న్‌ల దాఖలు ఆలస్యం, తదితర సమస్యలు పరిశీలించబడ్డాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంపిన లేఖలో పేర్కొన్నారు. జీఎస్టీ పాలనను మరింత మెరుగుపరిచేందుకు సూచనలకు సిద్ధంగా ఉందని తెలియజేశారు. ప్రభుత్వం, పన్ను చెల్లింపుదారుల సమ్మతి భారాన్ని తగ్గించడానికి, పన్ను విధానాన్ని సరళీకృతం చేయడానికి, వ్యాపారాన్ని సులభతరం చేయడానికి ఎప్పటికప్పుడు అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. జీఎస్టీఆర్-09 నమోదయిన వారికీ 2017 ఆర్థిక సంవత్సరం నుంచి మార్చి 2023 వరకు పూర్తిగా మినహాయింపు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

మహిళల కళ్లల్లో ఆనందం

విశాలాంధ్ర-తాడికొండ : ప్రభుత్వ పథకాలు చేరువ కావడంతో మహిళల కళ్ళల్లో ఆనందం కనబడుతోందని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వ యకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. పొన్నెకల్లు గ్రామంలో బుధవారం గడపగడప కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అడ్డరోడ్డు నుంచి పొన్నెకల్లు వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించాలని కాలనీవాసులు కోరారు. రహదారిణ విస్తరణ పనులకు చర్యలు చేపడతామని సురేష్ కుమార్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజల వద్దకు మరిన్ని పథకాలు రానున్నాయని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలు ఆంధ్రప్రదేశ్లో అమలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి, సర్పంచి నూకతోటి మేరమ్మ వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, పప్పుల సీతారామిరెడ్డి, ఎస్.రాజ్‌కుమార్, చింతల భాగ్యరావు, తాడిపోయిన శివన్నారాయణ, అధిక సంఖ్యలో, గ్రామస్తులు పాల్గొన్నారు.

అపోహలు నమ్మవద్దు

విశాలాంధ్ర-ఫిరంగిపురం : మార్ట్ విషయంలో ఎలాంటి అపోహలు నమ్మవద్దని ఏపీఎం సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఏ లోన్స్‌కి, ఎవ్వరికి ఏ విధమైన రుసుము చెల్లించనవరం లేదని, ఒకవేళ ఏదైనా చెల్లింపులు చేస్తే అట్టి డబ్బులకు సంబంధించిన రశీదును వీఓఏ వద్ద నుంచి తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే మండల సమాఖ్యకు తెలియజేయాలని కోరారు.

క్యూఆర్ కోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో ప్రకటనల బోర్డ్‌లకు ఏర్పాటు చేస్తున్న క్యూఆర్ కోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, విస్తరణ పనులు చేపట్టిన రోడ్లలో నగరపాలక సంస్థ నుండి పెండింగ్ పనులు పూర్తి చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రణాళిక అధికారులు క్షేత్ర స్థాయిలో కోడ్ ఏర్పాటు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మీడియా డివైజ్ డిస్ప్లే ఫీజులు చెల్లించని వారి బోర్డ్ లు తొలగించడం, వసూళ్ళకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏ.సి.పి.లు కాలేష, బాబురావు, అజయ్ కుమార్, సర్వేయర్ సునీల్ కుమార్, టి.పి.ఎస్.లు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'కు అపూర్వ స్పందన: ఎంపీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : 'మా నమ్మకం నువ్వే జగన్'' కార్యక్రమానికి అడుగు అడుగున అపూర్వ స్పందన వస్తుందని రాజ్య సభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫాలు తెలిపారు. బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని 50వ డివిజన్ శారద కాలనీ ఆర్చి సెంటర్ రోడ్డులో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం సందర్భంగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి పాలన పట్ల 5 ప్రశ్నల ద్వారా ప్రజా అభిప్రాయాన్ని సేకరించారు. అనంతరం స్థానిక ప్రజల అనుమతి మేరకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టికర్లను ప్రజల ఇంటికి, వారి సెల్‌ఫోన్‌లకు అంటించారు. అనంతరం వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం కేంద్రంతో పోరాడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తూర్పు వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, స్థానిక కార్పొరేటర్ వనమా బాల వజ్రబాబు, గుంటూరు నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీల, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సచివాలయ సేవలతో మంచి పేరు తేవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా సెక్రటరీలు ప్రజలకు సత్వరమే సేవలందించి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా సూచించారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో నియోజకవర్గ సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ ప్రతి ప్రజా సేవలకు సంబందించి సచివాలయాల ద్వారానే అందిస్తున్న నేపథ్యంలో అడ్మిన్ సెక్రటరీలు కీలకంగా వ్యవహరించాలని కోరారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ వారికి కావాల్సిన సేవలను అందిస్తూ సమస్యలను పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకులు అడపా శేషుబాబు, తూర్పు వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా తదితరులు ఉన్నారు.

సర్వమత సమానత్వానికి ప్రతీక ఇఫ్తార్

విశాలాంధ్ర-గుంటూరు : పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ సర్వమత సమానత్వానికి ప్రతీక అని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు ఏకే సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక గౌలుసుకొండలరావు నగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ దావత్ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, మైనారిటీ నాయకులు జియావుర్ రహిమాన్, జనసేన నగర అధ్యక్షులు నేరెళ్ళ సురేష్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ చైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్, ట్రస్ట్ నిర్వాహకురాలు ఆషా తదితరులు పాల్గొన్నారు. ముస్లింల ఉపవాస దీక్ష విరమణ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని మనషులంతా సోదర భావంతో ఉండాలని అన్నారు.

వినసొంపుగా మార్చే విలక్షణ ప్రక్రియే సంగీతం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : శబ్దాన్ని కాలంతో మేళవించి వినసొంపుగా మార్చే విలక్షణ ప్రక్రియే సంతీతమని సంగీత విద్వాంసులు పి.మొగిలి తెలిపారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో మనమూ పాడుదాం రండి బృంద సభ్యుల ఆధ్వర్యంలో సంగీత ప్రధాన పాటల కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సంగీత ప్రధాన పాటలు గాయనీ, గాయకులు ఆలపించి చూపరులను మైమరిపించారు. అనంతరం మొగిలి మాట్లాడుతూ సంగీతం విశ్వమంతా వ్యాపించి ఉందన్నారు. జీవన గమనంలో భాగమై మనిషినీ, మనసును రంజింప చేయగల సుప్రసిద్ధ చతుష్షష్టి కళలలో సంగీతం ఒకటని కొనియాడారు. ప్రముఖ గాయకులు డీటీ సాయిబాబు మాట్లాడుతూ శిశువులు, పశువులు, పాములు కూడా సంగీతానికి పరవశం చెందుతారన్నారు. సంగీత విద్వాంసులు వీఎస్ఎన్ మల్లేశ్వరరావును అవగాహన సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాయనీ, గాయకులు విజయశ్రీ, భాగ్యలక్ష్మి, రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : డీఎస్సీ-98 అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ ఆ బ్యాచ్‌కు చెందిన ఇరువురు అభ్యర్థులు సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన ఘటన గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి చినకాకానిలో బుధవారం చోటు చేసుకుంది. పులివెందులకు చెందిన రమేష్, నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీనివాస్ అనే ఇద్దరు డీఎస్సీ అభ్యర్థులు సెల్ టవర్ ఎక్కి నిరసన చేపట్టారు. సెల్ టవర్ పైకి ఎక్కి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఫ్లెక్సీని చేత పట్టుకుని నిరసనకు దిగారు. రోస్టర్ పద్ధతి ప్రకారం పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఆర్డర్ ఆఫ్ మెరిట్ వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ బి.అంకమ్మరావు, పెదకాకాని సీఐ సురేష్ బాబు పోలీస్ బలగాలతో సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. సెల్ టవర్ ఎక్కిన ఇరువురు అభ్యర్థులతో చర్చించారు. ఇద్దరూ కిందికి దిగారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో తహశీల్దార్ రామ్ ప్రసాద్, రెవెన్యూ, ఫైర్, సచ్చివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌లో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర-మంగళగిరి : నగర పరిధిలోని చిన్నకాకాని బైపాస్ రోడ్డులోని ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్టులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బ్యాటరీల నుంచి గ్యాస్ లీకై కార్యాలయంలో పొగ ఆవరించడంతో ఉద్యోగులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. పొగ బయటకు వెళ్ళడం కోసం సిబ్బంది కార్యాలయ అద్దాలు పగులగొట్టారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

ఉద్యోగం చేస్తూనే... ఉన్నత విద్య

విశాలాంధ్ర-మంగళగిరి : ఉద్యో గంతో పాటు వివిధ వృత్తుల్లో రాణిస్తూ ఉన్నత విద్యను అభ్యసిం చాలనుకునే వారి కోసం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సరికొత్త పీజీ కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రఖ్యాత టైమ్స్ ప్రో పోర్టల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగేంద్ర వీ చౌదరి పేర్కొన్నారు. బుధవారం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఎగ్జిక్యూటివ్ మాస్టర్స్ బిజినెస్ కోర్సు(ఈఎంబీఏ)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో డాక్టర్ నాగేంద్ర ప్రసంగించారు. ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. వివిధ కారణాల వల్ల బిజినెస్ సెక్టార్లో ఉన్నత విద్యను చదువుకోలేని వారు ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అందుబాటులోకి తెచ్చిన ఈఎంబీఏ కోర్సు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పారి బిజినెస్ స్కూల్ డీన్ డాక్టర్ భరద్వాజ్ మాట్లాడుతూ తొలిసారిగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఈ తరహా పీజీ కోర్సును ప్రారంభించిం దన్నారు. ఈ కోర్సులో మార్కెటింగ్, ఫైనాన్స్, హెచ్ఆర్ వంటి ప్రాధాన్యత గల స్పెషలైజేషన్లు ఉంటాయన్నారు. అడ్మిషన్లు లభించిన వారు వారం మార్చి వారం తరువాత వచ్చే శని, ఆదివారాల్లో నేరుగా తరగతులకు హాజరుకావా లనీ, మిగతా రోజుల్లో ఆన్‌లైన్ క్లాసులకు హాజరైతే సరిపోతుందన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు 'అమేయ' పేరుతో జరిగే బిజినెస్ ఫెస్ట్‌ను డాక్టర్ నాగేంద్ర ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో డీన్ డాక్టర్ భరద్వాజ్ కోర్సు వివరాలను వెల్లడించారు. వర్సిటీ కంట్రోలర్ డాక్టర్ వినా యక్, సీఏపీవో సుమ, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ పంకజ్ పాల్గొన్నారు.

ఈఓఐలో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనాలి: పీసీసీ

విశాలాంధ్ర-గుంటూరు : విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వహణకు మూలధనం కోసం నిధులు ఇచ్చి, నిబంధనల మేరకు ఉక్కు ఉత్పత్తులను కొనేందుకు యాజమాన్యం నిర్వహిస్తున్న ఈఓఐ(ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్) ప్రతిపాదనల బిడ్డింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనాలని పీసీసీ ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఈ బిడ్డింగ్‌లో పాల్గొంటున్నట్లు ప్రకటించిందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. గుంటూరులోని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం రూ.3500 కోట్ల మూల నిధిని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయిస్తే పరిశ్రమను పరిరక్షించడం సాధ్యమౌతుందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు.

ప్రజలు తిరగబడాలి: ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉంటున్నారనే ఉద్దేశ్యంతో వివిధ కారణాలు చూపుతూ సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తున్న వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడాలని రుద్రరాజు పిలుపునిచ్చారు. బలవంతంగా ఇంటింటికి సీఎం జగన్ స్టిక్కర్లను అంటించడం మంచిపద్ధతి కాదని అన్నారు. సంక్షేమ పథకాలు వైసీపీ ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదని, అది ప్రజల చట్టబద్ధ హక్కు అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసే చర్యలను సీఎం జగన్ వీడకపోతే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

వరికపూడిశెల ప్రాజెక్టు కోసం ఐక్యంగా పోరాడుదాం..

- రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రముఖుల పిలుపు
- చిత్తశుద్ధితో పోరాడి సాధించుకుందాం: ముప్పాళ్ళ

విశాలాంధ్ర-వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండలో మంగళవారం గోగినేని కళ్యాణ మండపంలో అఖిలపక్ష పార్టీల రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు తోట ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి, మాజీ ఎంపీ వడ్డె శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన వినుకొండలో బొల్లాపల్లి వెల్దుర్తి దుర్గి మండలాలు బాగా వెనకబడి ఉన్నాయని తాగు నీరు సాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వరిక పూడి శెల చాలా ప్రాజెక్టుగా నిర్మాణం అయితే ఈ మండలాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. నాలుగు దశాబ్దాల పోరాటంలో ఈ ప్రాజెక్టును నిర్మించడంలో ఇప్పటివరకు పాలించిన పాలకవర్గాలు పూర్తిగా వైఫల్యం చెందాయని, ఈ నాలుగు సంవత్సరాలలో కూడా ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే ఈ ప్రాజెక్టు గురించి పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయమని, ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా అందరం ఒకటై ఉద్యమాల ద్వారా ప్రాజెక్టు సాధించాలని దీనికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మరో ముఖ్య అతిథి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మీడియా చైర్మన్ మాజీ ఎంపీ డాక్టర్ తులసి రెడ్డి మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాజెక్టు కుంటుపడ్డాయని, జగన్మోహన్ రెడ్డి కేసుల మీద చూపించే సరదా ప్రాజెక్ట్‌ల మీద చూపించలేదని రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రంలో నీటి సమస్య తీవ్రమవుతుందని ఇప్పటికైనా ప్రజాభిప్రాయాలు మన్నించి వరికపూడిశెల ప్రాజెక్టుకి అనుమతులిచ్చి నిధులు కేటాయించాలని లేదంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానంగా పల్నాడు జిల్లాలోని మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం వద్ద వరికపూడిశుల ప్రాజెక్టు నిర్మాణం కోసం దశాబ్దాల తరబడి వెల్దుర్తి దుర్గి కారంపూడి బొల్లాపల్లి పుల్లలచెరువు మండలాల ఎస్సీ ఎస్టీ వర్గాల పేద ప్రజలు ఆయా ప్రాంతాల గ్రామాల నివాసులు ఎన్నో పోరాటాలు చేసి ఆ ప్రాజెక్టు కోసం ఎదురు చూస్తున్నారని ఇంతవరకు ఆ కల సాకారం అయ్యే పరిస్థితి కనిపించలేదని పేర్కొన్నారు. వరిక పుడిసెల సాధన కమిటీ పేరుతో అనేక పోరాటాలు జరిగాయని దానిలో కమ్యూనిస్టు పార్టీలు కూడా కలిసి ఉద్యమాల్లో పాల్గొన్నామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఏకమై చిత్తశుద్ధితో పోరాడి దీనిని సాధించాలని ముప్పాళ్ళ నాగేశ్వర రావు అన్నారు. 2008 ఏప్రిల్ నెలలో ఈ ప్రాజెక్టు కోసం మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలాలలో చుట్టు పక్కల గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రాజెక్టు నిర్మాణం కోసం పాదయాత్రలు నిర్వహించామని అనంతరం భారీ బహిరంగ సభ జరిపామని అన్నారు. 2008లో జూన్ నెల 6వ తేదీన ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వరికపుడిశల ప్రాజెక్టు కోసం శంకుస్థాపన చేసి 350 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. ఆయన మరణానంతరం ఆ ప్రాజెక్టు పట్టించుకున్న వారు లేరని పోరాటాలతోనే ఈ ప్రాజెక్టును సాధించుకోవాలని ఎందరో అమరవీరుల పోరాటాల ఫలితంగానే 1955 డిసెంబర్‌లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన జరిగిందని అనాటి ఖోస్లా కమిటీ నివేదికలో సాగర్ ప్రాజెక్టు వల్ల నివాసాలు భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఈ వరికపుడిసెల ప్రాజెక్టును నిర్మించవలసిన ఆవశ్యకతను నివేదిక రూపంలో ఇచ్చిందని తెలిపారు ఆనాటి నుంచి ఈ పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు. సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ వరిక పుడిసెల ప్రాజెక్టు కొరకై వామ పక్షాలు ప్రజాసంఘాలు ఇప్పటికే అనేక పోరాటాల నిర్వహించామని ఇటీవల ఫిబ్రవరిలో కూడా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల సందర్శనతో పాటు వరికపుడిశల ప్రాజెక్టును సందర్శించి అది వెంటనే నిర్మించవలసిన ఆవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ముఖ్యమంత్రికి అర్జీల రూపంలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఇచ్చామని అన్నారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశానికి విచ్చేసిన వివిధ ప్రజా సంఘాలకు, రాజకీయ పార్టీలకు అభినందనలు తెలిపారు. జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేడు పరిపాలిస్తున్న వైఎస్సార్ పార్టీ ప్రజల్ని మాయ చేస్తూ మభ్యపెడుతూ ప్రజలను ఓట్లు వేసిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని నాలుగు సంవత్సరాలు క్రితం వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఈ ప్రాజెక్టు రాకపోతే నన్ను చొక్కా పట్టుకొని నిలదీయండని మీ ఊర్లకు రానియవద్దని నేను మిమ్మల్ని ఓట్లు అడగనని చెప్పిన పెద్దమనిషి నేటీ వరకు ఈ ప్రాజెక్టు గురించి చిన్న ప్రయత్నం కూడా చేయకుండా కల్లబొల్లి కబుర్లతో ప్రజల్ని మభ్యపెడుతున్నారని రాబోయే రోజుల్లో ఆయనకు సరైన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో నల్లమల్ల రైతు సంఘం అధ్యక్షులు కొల్ల రాజమోహన్, సీపీఎం రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, ఆల్ ఇండియా బంజారా సంగం యువజన అధ్యక్షుడు రాంబాబు, వరిగపుడిశాల ప్రాజెక్టు సాధన కమిటీ కార్యదర్శి రామాంజనేయ నాయక్, గండి గణముల మాజీ సర్పంచ్ కోట నాయక్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గోవింద నాయక్, సీపీఐ ఎమ్మెల్ లిబరేషన్ నాయకులు ఎస్.కె ఫిరోజ్, దుర్గాప్రసాద్, భాస్కర్, ఎం.సీతయ్య, వెంకటేశ్వర్లు, బొల్లాపల్లి కోటేశ్వరరావు, జనసేన నాయకులు నిశంకర శ్రీనివాసరావు, నాగ శీను, సీపీఐ నాయకులు ఉలవలపాటి రాము, బూదాల శ్రీనివాసరావు, వందనం వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. అనంతరం మారుతి వరప్రసాద్ వందన సమర్పణ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో 22 మంది బాధితులకు వచ్చిన 18 లక్షల 81 వేల రూపాయల సీఎం ఆర్థిక సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధ పడుతూ వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేదలను ప్రభుత్వం ఆదు కుంటుందన్నారు. ఆరోగ్య శ్రీ అనుమతులు ఉన్న వైద్యశాలలోనే చికిత్స చేయిం చుకోవాలన్నారు. చాలా రకాల వ్యాధులను నేడు సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చారని, అన్ని వైద్య సౌకర్యాలు, ఆయా విభాగాల్లో నిపుణులు ఉన్న ఆసుపత్రులకు మాత్రమే ఆరోగ్యశ్రీ అనుమతులు కల్పించిందని ప్రజలు గమనించి ఆరోగ్యశ్రీ అనుమతి ఉన్న ఆసుపత్రిలో చికిత్సను పొందాలని కోరారు. ఆరోగ్యశ్రీ ఉండి కూడా ఆసుపత్రి యాజ మాన్యం వారు నగదును డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొడపాడులో జగనన్నే మా భవిష్యత్తు

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని పొడపాడు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మొదటి రోజు నుంచి ముమ్మరంగా సాగుతుంది. పెదకూరపాడు మండల సోషల్ మీడియా కన్వీనర్ వెలితోటి చిన్నబాబు, గ్రామ నాయకులు బొంత మధుబాబు, చాట్ల జోజి ఆధ్వర్యంలో గృహ సారథులు వలంటీర్లు కలిసి ప్రతిరోజు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మా నమ్మకం నువ్వే జగన్ నినాదాలతో ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే డోర్ స్టిక్కర్స్‌ను మొబైల్ స్టిక్కర్స్‌ను ప్రజల అనుమతితో అంటిస్తూ గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం మధ్య తేడా తెలుపుతున్న కరపత్రాలు అందిస్తున్నారు. అదేవిధంగా వారి ఇష్టంతో పార్టీ వారు సూచించిన మొబైల్ నెంబర్‌కు కాల్ చేయిస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-యడ్లపాడు : యడ్లపాడు మండలం మైదవోలు గ్రామంలో ఇటీవల పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న నక్కా యల్లమంద కుటుంబానికి జనసేన పార్టీ తరపున బుధవారం ఆర్థిక సహాయం అందించారు. పార్టీకి చెందిన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజా రమేష్ రూ.15 వేలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో ఆత్మహత్యలకు పాల్పడిన 9 మంది కుటుంబాలకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లక్ష రూపాయలను అందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో యడ్లపాడు మండల అధ్యక్షులు గల్లా వెంకట్రావు, చిలకలూరిపేట మండల అధ్యక్షులు పఠాన్ ఖాదర్ బాషా, మండల ఉపాధ్యక్షులు మల్లా కోటి, కార్యదర్శులు రామకృష్ణ, నాని, వీరాంజనేయులు చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు షేక్ మునీర్ హసన్, శివశంకర్, సాంబ, కిషోర్, వెంకట్, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమరుల స్మారక సభ

విశాలాంధ్ర-యడ్లపాడు : తెలంగాణ, శ్రీకాకుళం ఉద్యమ పోరాటాల్లో పాల్గొని తుపాకీ గుళ్లకు బలైన గుంటూరు జిల్లాకు చెందిన 27 మంది అమరవీరుల స్మారక సభ 16వ నెంబర్ జాతీయ రహదారి పక్కనే తుమ్మలపాలెం వద్ద గల అమర్ నగర్‌లో గురువారం నిర్వహించనున్నట్లు సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్న ఈ సభలో సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన పల్నాడు జిల్లాల కార్యదర్శులు ఎ.మారుతివరప్రసాద్, గుంటూరు విజయకుమార్, సీపీఐ ఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్ బాబు, న్యూ డెమోక్రసీ నాయకురాలు ఎం.లక్ష్మి ప్రసంగించనున్నట్లు ప్రకటనలో వివరించారు.

మల్లారెడ్డికి రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర-యడ్లపాడు : నెల్లూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మామయ్య మల్లారెడ్డికు గురువారం యడ్లపాడు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారానికి వెళ్లి తిరిగి వెళుతుండగా 16వ నెంబర్ జాతీయ రహదారిపై యడ్లపాడు వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డు రావడంతో తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి సర్వీసు రోడ్డులోకి దూసుకెళ్లింది. మల్లారెడ్డి తలకు గాయం కావడంతో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మల్లారెడ్డి తలకు 10 కుట్లు పడినట్లు సమాచారం. కారులోని మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు.

బుక్కాపురం సర్పంచ్ రాజీనామా

విశాలాంధ్ర-నాదెండ్ల : నాదెండ్ల మండలం బుక్కాపురం సర్పంచి పదవికి అల్లడి రవికుమార్ రాజీనామా చేశారు. నరసరావుపేట డీపీవో విజయభాస్కరరెడ్డికి బుధవారం రాజీనామ లేఖ సమర్పించారు. పదవి పంపిణీ ఒప్పందంలో భాగంగా రవికుమార్ రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన సర్పంచి అల్లడి రవికుమార్ మాట్లాడుతూ ఈ రెండేళ్లలో తనకు సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భూసార పరీక్షలు చేయించండి...

విశాలాంధ్ర-రెంటచింతల: ప్రతి ఒక్క అన్నదాత భూసార పరీక్షలు చేయించేకోవాలని స్థానిక ఏఓ బ్రహ్మారెడ్డి కోరారు. బుధవారం స్థానిక ఆర్బీకే కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పరీక్షల వల్ల భూమిలో ఉన్న ఎరువుల మోతాదు తెలుసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పోషకాలు తగిన పాళ్ళల్లో వేసుకొని పంటల దిగుబడి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వీఏఏలు ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోర్ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వెల్దుర్తి : తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీ ప్రజలకు ఆరు లక్షల రూపాయలతో నిర్మించిన బోరుబావిని ఎమ్మెల్యే పీఆర్కే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో మండల ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఏడు గ్రామాలకు మంచినీటి సరఫరాకు ఏర్పాటుచేసిన జెర్రివాగు ఫేజ్-2కు మరమ్మతులు జరిపి నీటి సరఫరాను త్వరలో పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. కుర్రి సాయి మర్కొండా రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కొండలు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గోపాల్ నాయక్, ఏఈ బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగ వైకల్యం వారిని ఆదరించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : మానసిక అంగవైకల్యం ఉన్న వారిని చులనకన చేసి చూడవద్దని కేఎల్ విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ కోనేరు రాజాహరీన్ అన్నారు. అటువంటి వారిని అక్కున చేర్చుకుని ఆదరించడం మనిషిగా మన భాద్యత అని అన్నారు. బుధవారం కేఎల్‌యూ వర్సిటీలోని న్యూ సెమినార్ హాలులో జరిగిన ఆటిజం(మానసిక అంగవైకల్యం) అనే అంశంపైన జరిగిన అంతర్జాతీయ ఒక రోజు కార్యశాలలో ఆయన విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. సదస్సు కన్వీనర్ అధ్యాపకులు డాక్టర్ వసుజాదేవి అధ్యక్షత వహించగా ప్రపంచ వ్యాప్తంగా మానసిక రోగులకు విశిష్ట సేవలను అందిస్తున్న బెంగళూరులోని నిమ్ హాన్స్ వైద్యాధికారి, మానసిక శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిమా మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతిమా మూర్తి, ప్రో చాన్సులర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు, ప్రొఫెసర్ శామ్యూల్ అబ్రహం, డాక్టర్ కె. నాగార్జున, డాక్టర్ బి.శ్రీదేవి, డాక్టర్ ప్రతిమామూర్తి, డాక్టర్ టి.వెంకటేశ్వరులు, ప్రొఫెసర్ వై.అపర్ణ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.రాజా హరీన్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎస్.వెంకట రామ్ పాల్గొన్నారు.

జిల్లాలో 36,730 మందికి ఈబీసీ నేస్తం : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన వై.ఎస్.ఆర్.ఇ.బి.సి. నేస్తం రెండవ విడత ఆర్థిక సహకారం పంపిణీ పథకం ద్వారా రూ.55.095 కోట్లను 36,730 మంది లబ్దిదారుల ఖాతాల్లో జిల్లా కలెక్టర్ శివ శంకర్ బుధవారం జమ చేశారు. తొలి ఏడాది ఇ.బి.సి.నేస్తం పథకం ద్వారా 2021-2022 ఆర్థిక సంవత్సరం నుంచి పల్నాడు జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువనున్న ఇ.బి.సి. మహిళల్లో 45నుంచి 60ఏళ్ల వయసు గల వారికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆర్థికంగా బలోపితం చేసేందుకు ఇ.బి.సి. కార్పోరేషన్ ద్వారా సంవత్సరానికి రూ.15,000 చొప్పున 3 సంవత్సరాలకు గాను రూ.45,000లు ప్రభుత్వం అందిస్తున్నదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. 2021-2022 ఏడాదిలో పల్నాడు జిల్లాలో 32,393 మందికి, రూ.48.50 కోట్ల ను తొలివిడతలో ప్రభుత్వం అందించినదని కలెక్టర్ పేర్కొన్నారు. రెండవిడతలో 2022-23 ఏడాదిలో రూ.55.095 కోట్లను 36,730 లబ్దిదారులు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురం బహిరంగసభలో లబ్దిదారుల 2విడతను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. మొత్తం రెండు విడతల్లో పల్నాడు జిల్లా నుంచి 69,123 మంది ఐ.బి.సి. మహిళల ఖాతాలకు రూ.103.685 కోట్లను జమ చేశారు. అంతక ముందు జిల్లా కలెక్టర్ లబ్దిదారులతో ముఖ ముఖి మాట్లాడారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల వలన కలుగుతున్న మేలు ఏ విధంగా ఉపయోగ పడుతుందని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు రాకుండా ఇబ్బందులను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా బి.సి.వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వర్లు, నరసరావు పేట పట్టణ ఐ.బి.సి. మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు సన్మానం

విశాలాంధ్ర-వినుకొండ: మార్కాపురంలో జరిగే పార్టీ సమావేశంనకు వెళ్తున్న ఎమ్మెల్సి కంచర్ల శ్రీకాంత్ వినుకొండలో ఆగి జి.వి.ఆంజనేయులు కలిశారు. ఈ సందర్భంగా జీవీ శ్రీకాంత్‌ని సాదరంగా ఆహ్వానించి వారిని వినుకొండ నియోజకవర్గ టిడిపి నాయకులూ సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్సి కంచెర్ల శ్రీకాంత్ బుదవారం వినుకొండకి రావడం ఎంతో ఆనందంగా ఉందని గెలుపులో మెజార్టీ సృష్టించారని అరాచక పాలనకు ఒక ముగింపు ఎలా ఉంటుందో భవిష్యత్తులో ఉదాహరణ చూపించారని అన్నారు. గెలుపు కోసం ఎంతో కష్ట పడ్డారని. శాసనమండలిలో వారి గొంతు వినిపించి ప్రజా సమస్యలపై నిరుద్యోగ సమస్యలపై పోరాడతామని ఈరోజు వినుకొండ పట్టణం వచ్చినందుకు వారికీ అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్సి శ్రీకాంత్ మాట్లాడుతూ గెలిచి వినుకొండకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జి.వి.ఆంజనేయులు అన్నని కలుసు కోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ రాష్ట్రము లో చదువుకున్న విద్యావంతులు నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులు ఈ ప్రభుత్వం మీద అసంతృప్తి తో ఉన్నారని, రాష్ట్ర భవిషత్తు ఏమై పోతుందో అనే భయంతో ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరు కుడా ఈ రాష్ట్రము బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా గెలవాలని ఆశిస్తున్నారని టిడిపి ప్రభుత్వం వచ్చిన తరువాత అందరికి న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీంఖాను, టిడిపి నాయకులు పివీ. సురేష్ బాబు, పత్తి పూర్ణచంద్రరావు, వంకాయలపాటి పేరయ్య, ముంద్రు సుబ్బారావు, సౌదాగర్ జానీ భాష, బచ్చు అంజిరెడ్డి, మీసాల మురళీకృష్ణ యాదవ్ కర్నాటి వెంకటరెడ్డి రోడ్డ వీరాంజనేయరెడ్డి, రావుల మల్లేశ్వరరావు, గోల్డ్ కరి ముల్లా, రియల్ ఎస్టేట్ జానీ బత్తుల సుబ్బారావు, వీరగంధం ఆనంద్, అభిమానులు పాల్గొన్నారు,

ఎస్పీ బిందు మాధవ్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర-నరసరావుపేట: ఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్‌ను జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి, జిల్లా పోలీస్ అధికారులు ఘనంగా సన్మానిం చారు. 2017 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన బిందుమాధవ్ గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్ఈబి జాయింట్ డైరెక్టర్‌గా, తదనంతరం నూతన ఏర్పడిన పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్వహిస్తూ, ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది గ్రేహౌండ్స్ ఎస్పీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ రవి శంకర్ రెడ్డి అధ్యక్షతన బదిలీపై వెళుతున్న ఎస్పీ బిందుమాధవ్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు అభినందన సభలో పూలమాలలు, దుస్సాలువాతో ఘనంగా సత్కరించి, ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహచర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన)గా విశేష సేవలందించి, జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో, పరిపాలనలో మాకు సహాయ సహకారాలు అందించినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) రామచంద్రరాజు, పల్నాడు జిల్లా ఎక్సయిజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ రెడ్డి, డిఎస్పీలు, సీఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ ఏఓ రామారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీని గద్దె దింపండి... దేశాన్ని కాపాడండి

విశాలాంధ్ర-దాచేపల్లి : స్థానిక నారాయణపురం సీపీఐ కార్యాలయంలో బుధవారం సీపీఐ, సీపీఎం ఉభయ కమ్యూనిస్టు పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 30 వరకు మోదీ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా మోదీని గద్దె దింపండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ప్రతి గ్రామానికి కమ్యూనిస్టు పార్టీలు ప్రచార ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నాయని నేతలు తెలిపారు. కేంద్రంలో ఉన్న అధికార బీజేపీ తమ కార్పొరేట్ విధానాలను కప్పిపుచ్చుకోవడానికి మతోన్మాదాన్ని దేశంలో ఎగదొస్తుందని, అలాగే దేశ సంపద అంతా కార్పొరేట్లకు కట్టబెడుతూ సామాన్యులకు భారాలు కల్పిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా మన రాష్ట్రంలో ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణం వంటి అనేక విషయాలపై ద్రోహం చేసిందని ఆంధ్రప్రదేశ్‌కు తలమానికంగా నిలిచిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మాలని చూస్తున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలన్నిటిని ప్రతి గ్రామంలోని ప్రజలందరికీ చేరవేసే విధంగా ఈ ఆందోళన కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, మండల కార్యదర్శి కొమర వెంకటరావు, సీపీఎం నేతలు ఆంజనేయరాజు, నాగేశ్వరరావు, రామ సైదులు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-వెల్దుర్తి : మహి ళల అభ్యున్నతే జగనన్న లక్ష్యం అని మాచర్ల శాసనస భ్యులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కస్తూరిబా పాఠశాల ఆవరణలో జరిగిన జగనన్న ఆసరా పథకం కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 640 గ్రూపులకు గాను మొత్తం రూ.3.70 కోట్ల ఆసరాను అక్కచెల్లెళ్లకు జగ నన్న కానుక ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం మహిళల పక్షపాతని, ప్రభుత్వ పథకాలలో మహిళలకు ఇచ్చే ప్రాధాన్యత గుర్తించాలని ఆయన కోరారు. చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అన్నమాట ప్రకారం తూచా తప్పకుండా సంక్షేమ పథకాలు అమలు చేసే జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎప్పుడు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇప్పటివరకు సుమారు రూ.300 కోట్లను సంక్షేమ రూపంలో మండలంలోని ప్రజలకు అందించడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు పూర్తి అబద్దాలకోరని నమ్మిన మామ ఎన్టీఆర్‌ను నట్టేట ముంచిన ఘనచరిత్ర అతనికి ఉందని ఎద్దేవాచేశారు. మండల ప్రజల చిలక కోరిక అయిన వరికపూడిసెల ఎత్తిపోతల పథకాన్ని అన్ని అనుమతులతో అతి త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని సభాముఖంగా తెలిపారు. బోర్ల నిర్మాణానికి ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వద్దని, డబ్బులు ఇవ్వమని ఎవరైనా డిమాండ్ చేస్తే తన దృష్టికి తీసుకొనిరావాలని కోరారు. ప్రజలందరూ రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని బలపరిచి జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని సభాముఖంగా కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతా శివరామయ్య, జడ్పీటీసీ రూప్లిపై బాలు నాయక్, పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ తాడి వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉప సర్పంచి రాజీనామా

విశాలాంధ్ర-రెంటచింతల: ఉప సర్పంచి పదవికి యేరువ ప్రమీలారాణి బుధవారం రాజీనామ చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామ చేస్తున్నట్టు లేఖలో వివరించి పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావుకు అందచేసింది. ఎన్నికల ఒప్పందంలో భాగంగానే రాజీనామా చేసినట్లు తెలిసింది. మరో వార్డు సభ్యుడిని త్వరలో ఉప సర్పంచి పదవికి ఎన్నుకోనున్నారు.

రైల్వే సమస్యలపై కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు ప్రాంతంలోని పలు రైల్వే సమస్యల పరిష్కారం కోరుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం ఢిల్లీలో కలసారు. ముఖ్యంగా సికింద్రాబాద్ నుంచి తిరుపతి వరకు ఈ మధ్య ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను పల్నాడులో ఎంతో ముఖ్యమైన పిడుగురాళ్ల స్టేషన్‌లో కానీ, నడికుడి స్టేషన్‌లో కానీ ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు స్టేషన్‌ల నుంచి ప్రయాణీకులు, వ్యాపారస్తులు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. ఈ రైల్ వల్ల పల్నాడు జిల్లాలో పర్యాటక, వ్యాపార ప్రయాణాలను ఆకర్షించడం ద్వారా ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహిస్తుందని మంత్రికి తెలిపారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వరకు వందేభారత్ రైల్‌ను ప్రారంభించాలని చేసిన విన్నపం మేరకు రైల్‌ను ప్రారంభించినందుకు మంత్రికి ముందుగా ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్‌లో ఆగే కొన్ని రైళ్లు ప్రస్తుతం ఆగటం లేదని, కొవిడ్ సమయంలో కొన్ని రైల్లు నిలుపుదల తీసేసారని, దీని వల్ల పెద్ద ఎత్తున ప్రజలు అసౌకర్యానికి గురవతున్నారని తెలపారు. రైలు నెం.12733 - నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, రైలు నెం.17255 - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్, రైలు నెం.12603 - హైదరాబాద్ ఎస్ఎఫ్ ఎక్స్‌ప్రెస్, రైలు నెం.17626 - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, రైలు నెం.17015 విశాఖ ఎక్స్‌ప్రెస్... ఈ రైళ్లను గతం లాగా పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్‌లో ఆగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం సికింద్రాబాద్, గుంటూరు మధ్య రెండవ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ అభ్యర్థనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

బీసీ భవన నిర్మాణానికి రూ.25 లక్షలు విరాళం

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో మాత్మ జ్యోతిరావు పూలే బీసీ భవన్ నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు 25 లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. పల్నాడు జిల్లా బీసీ బీసీ సంఘాల నాయకులు ఇటీవల చిలకలూరిపేటలో ఎంపీ బీద మస్తాన్ రావును కలిసి బిసి భవనిర్మానానికి సహకరించాలని కోరారు. ఈ మేరకు తన వంతు సహాయంగా సొంత నిధుల నుండి 25 లక్ష రూపాయలను బీసీ భవన్ నిర్మాణానికి ఆయన విరాళంగా ప్రకటించారు. ఎంపీని కలిసిన వారిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, బీసీ సంఘాల పెద్దలు. ఈ ఎం స్వామి మాస్టర్, వేముల శివ , మరిపూడి రాంబాబు, పూర్ణచంద్ర, మాడిశెట్టి మోహన్ తదితరులు ఉన్నారు.

ప్రచార కార్యక్రమాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న మోదీ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో పెదకూరపాడు నియోజకవర్గంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రాజకీయ ప్రచారం చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా 23వ తేదీ నియోజకవర్గ బహిరంగ సభ జరుగుతుందని సీపీఐ, సీపీఎం నాయకులు మునగోటి శ్రీనివాసరావు, జి.రవిబాబులు బుధవారం క్రోసూరు ఆమంచి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని, రాజధాని నిర్మాణానికి నిధులు ఇస్తానని, పోలవరం నిర్మాణం చేపడతానని, ఇటువంటి అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా అన్యాయం చేశారన్నారు. ప్రజలు పోరాటాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మటం దుర్మార్గమని, అదేవిధంగా పోలవరం నిర్మాణానికి నిధులు సరిగా ఇవ్వకుండా కేవలం నిర్మాణానికి మాత్రమే నిధులు ఇస్తామని పునరావాసం మా బాధ్యత కాదు అని మాట్లాడటం దుర్మార్గమని అన్నారు. విభజన సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఆస్తుల వాటాల పంపిణీ జరపకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఇటువంటి విధానాలను వ్యతిరేకించాల్సిన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మోదీ ప్రభుత్వాన్ని ఒక్క మాట అనకపోవడం వీరి మెతక వైఖరికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న ప్రచార కార్యక్రమాలలో ప్రజలు కూడా పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టి.హనుమంతరావు, పి.నాగేశ్వరరావు, కంచేటి పెద్దబ్బాయి, పి.యాదగిరి, పోపూరి సత్యనారాయణ, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ నిర్మాణం పూర్తి చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతా: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పిడుగురాళ్ళ : తుమ్మల చెరువు టోల్‌టేట్ వద్ద గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పిడుగురాళ్ల పట్టణానికి సంబంధించిన 6 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణం విషయంలో కాంట్రాక్టు సంస్థ అలసత్వానికి నిరసనగా ఈ దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బైపాస్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్ని తొలగించినప్పటికి దాని నిర్మాణంలో క్యూబ్ సంస్థ కాలయాపన చేస్తుందన్నారు. మొదట ఈ ఏడాది జనవరిలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెస్తామని చెప్పి తర్వాత మార్చి అని అప్పటికి పూర్తి చేయలేక మరో నెలరోజుల గడువుకోరి ఇప్పటికి కూడా పూర్తి చేయలేకపోయారన్నారు. ట్రాఫిక్ ఇబ్బందుల వల్ల పట్టణ ప్రజలు బాగా ఇబ్బందిపడుతున్నారని త్వరితగతిన బైపాస్ పూర్తి చేసి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తిని ఇవ్వాలని పలుమార్లు చెప్పినా క్యూబ్ సంస్థ మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఆయన దీక్షలో ప్రధానంగా మూడు డిమాండ్లను కాంట్రాక్టు సంస్థ ముందు ఉంచారు. అందులో మొదటిది ఎప్పటిలోగా బైపాస్ రోడ్డు పూర్తి చేస్తారో చెప్పమన్నారు. అందుకు క్యూబ్ హైవేస్ చైర్మన్ హరి కిషన్ రెడ్డి, రాంకీ సంస్థ వైస్ చైర్మన్ దివాకర్ రెడ్డి, క్యూబ్ హైవేస్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ భగవాన్ రాజు నామ్ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు హెడ్ దామోదర్ రెడ్డి ప్రాజెక్టు మేనేజర్ ప్రసాద్‌లు స్పందిస్తూ బైపాస్ నిర్మాణం దాదాపుగా పూర్తయ్యాయని రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన గడ్డర్స్ నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయన్నారు. అయితే అవి ఘజియాబాద్ నుంచి తీసుకురావాల్సి ఉన్నందున కొంచెం సమయం పడుతుందని జూన్ 30వ తేదీ లోపల బైపాస్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పటివరకు భారీ వాహనాలు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పట్టణంలోనికి రాకుండా ఏం చేయగలరో చెప్పాలన్నారు. అందుకు కాంట్రాక్టు సంస్థ వారు ఈ నెల చివరిలోగా పిల్లుట్ల జంక్షన్ వరకు పూర్తిచేసి హైదరాబాదు నుంచి చెన్నై వెళ్ళు వాహనాలను పోలీస్ స్టేషన్ మీదగా మళ్లించే చర్యలు చేపడతామన్నారు. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్ళు వాహనాలను ఎలా మళ్ళిం చాలో అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జూన్ 30లోపు పూర్తి చేయకపోతే 5వేల మందితో కవాతు ఏర్పాటు చేసి ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటానని హెచ్చరించారు. టోల్ వసూలు కూడా పూర్తిగా అడ్డుకుంటామని అన్నారు. దీక్షలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవంపై దెబ్బకొట్టిన కేసీఆర్

విశాలాంధ్ర - చీరాల : రాజ్యాంగం మారుస్తా అసలు దళితులకు రాజ్యాంగానికి ఏమి సంబంధం లేదంటూ అను చిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 50 కోట్ల మంది దళితుల ఆత్మగౌరవంపై దెబ్బకొట్టారని, దళితుల గురించి, భారత రాజ్యాంగం గురించి తప్పుగా మాట్లాడిన కేసీఆర్‌పై ఎస్సీ,ఎస్టీ,అట్రాసిటీ చట్టం క్రింద అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు చెల్లి బాబురావు అన్నారు. బాబూరావు ఆధ్వర్యంలో కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలని చీరాల ముక్కో ణపు పార్కులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌ను అధికారం లోకి వస్తే దేశ భవిష్యత్తు, భారత రాజ్యాంగం ప్రమాదంలో పడుతుం దన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కేసీఆర్ పర్యటించాలంటే దళిత సోదరులకు క్షమాపణలు చెప్పాలని, 175 నియోజకవర్గాలలో మాల మహానాడు కమిటీలు వేసి కేసీఆర్‌కి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ర్యాలీగా చీరాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌కి వచ్చి కేసీఆర్‌పై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు కట్టాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో యాకోబు, సుబ్బారావు, ప్రకాశరావు, రవికుమార్, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర - చీరాల : తహసీల్దార్ కార్యాలయానికి పనుల నిమిత్తం పల్లెల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడ కుండా మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయడం అభినందనీయమని చీరాల ఆర్డీఓ పి సరోజిని అన్నారు.బుధవారం చీరాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే వేసవికాలంలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తోటవారిపాలెంలో గడప గడపకు..

విశాలాంధ్ర - చీరాల : ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బం దులు పాదయాత్రలో చూసి నవరత్నాల ద్వారా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికె దక్కుతుందని వైఎస్సార్సీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం తోటవారిపాలెం గ్రామ పంచాయతీ సచివాలయం-2లో గడపగడపకు మన ప్రభుత్వము కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల మండలభివృద్ధి అధికారి నేతాజీ,చీరాల మండలం ఆర్బికే చైర్మన్ కావూరి రమణారెడ్డి,పిఏసిఎస్ బోయిన కేశవులు,ఏపీఎం సుబ్బారావు, నాదెండ్ల కోటేశ్వరరావు, నాదెండ్ల సురేష్, దేగల చిన్న, దేగల నాగేశ్వరరావు, చినం చిట్టి బాబు, పర్వతనేని శ్రీను, అందే సాంబయ్య, దేగల ప్రసాద్, బుర్ల మురళి, బుర్ల సాంబశివరావు, మాచర్ల ఆంజనేయులు, గుమ్మడి చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు అందజేత

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కూడా చేర్చాలని ఉద్దేశంతో వృద్ధులకు, వితంతువులకు, నూతన వస్త్రాలను పంపిణీ చేసినట్లు మాజీ కౌన్సిలర్, తెదేపా నాయకుడు విజయ్ కుమార్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ప్రతి పేదవాడి గుండెలలో అంబేద్కర్ ఆశయాలు నింపేయాలని ఉద్దేశంతో ప్రతి వార్డులోను, గ్రామాలలోనూ అంబేద్కర్ ఆశయాలను గురించి ర్యాలీలను నిర్వహించి మహనీయులకు నివాళులర్పించనున్నట్లు విజయ్ కుమార్ తెలిపారు. 14వ తేదీ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని అంబేద్కర్ అభిమానులకు సూచిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలకు విక్టర్ చెక్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల పట్టణం జిల్లా కేంద్రంగా ఆవిర్భ వించిన నాటి నుంచి పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను తనదైన శైలిలో చెక్ పెడుతూ పట్టణ ప్రజల మన్నలను పొందుతున్నారు. పట్టణంలోని అభివృద్ధిలో భాగంగా జిబిసి రోడ్ నందు జరుగుతున్న డ్రైనేజీ పనుల వలన రోడ్డుపై అడ్డుగా ఉంటు న్న సామాగ్రిని తొలగిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న సమస్యలను ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ విక్టర్ పరిష్కరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై అడ్డుగా ఉన్న సామాగ్రి తొలగిస్తున్న విక్టర్ వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టింది.

సంతమాగులూరు ఎస్సైగా శివకుమార్

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలంలోని సంతమాగులూరు పరిధి లోని ఇప్పటివరకు విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ పి నాగశివారెడ్డి బదిలీపై వెళ్లడంతో నూతన ఎస్సైగా మేదరమెట్ల పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎం.వి శివకుమార్ కు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రజా చైతన్య యాత్రలు విజయవంతం చేద్దాం

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నాగాంజనేయులు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించు కుని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి మేరకు ఈనెల 14 నుండి మే 15 వరకు నిర్వహించ తలపెట్టిన ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాం జనేయులు పిలుపునిచ్చారు. బుధవారం భట్టిప్రోలు లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏకపక్ష నియంతృత్వ విధానాలను నిర సిస్తూ దేశ వ్యాప్తంగా నెలరోజులపాటు ప్రజా చైతన్య యాత్రలకు సీపీఐ జాతీయ సమితి పిలుపునిచ్చిందన్నారు. మన రాష్ట్రంలో ఈనెల 14 నుండి 30 వరకు సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రజా చైతన్య ప్రచార యాత్రలను నిర్వహిస్తారన్నారు. కేంద్రంలో బిజెపి అధికా రంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై పన్నుల భారాలను మోపుతూ పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీ తంగా పెంచడంతోపాటు నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తాత్సారం చేస్తుంద న్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతుందని నాగాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభు త్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పాదయాత్రలో భాగంగా రేపల్లె వేమూరు నియోజకవర్గాల్లో జరిగే యాత్రలో ప్రజ లు కార్మికులు కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బందారు శ్రీనివాస రావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- గుంటూరు జడ్పీ చైర్మన్ క్రిస్టినా
- జిల్లాలో రూ.39.28 కోట్లు ఈబీసీ నేస్తం నగదు జమ

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినా మహి ళలకు పిలుపునిచ్చారు. బుధవారం బాపట్ల కలెక్టరేట్‌లో వై.ఎస్.ఆర్.ఇ.బి.సి నేస్తం ముఖ్యమంత్రి వర్చువల్ లాంచింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. కుల మతా లకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తు న్నారన్నారు. పాదయాత్ర సమయంలో పేదల కష్టాలు చూసిన ముఖ్యమంత్రి అగ్రవర్ణాల పేద ప్రజల కోసం వై.ఎస్.ఆర్. ఇ.బి.సి నేస్తం కార్యక్రమం ద్వారా వారిని ఆదుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలకు గృహాలను నిర్మించడానికి పెద్దఎత్తున చర్యలు తీసుకు న్నారన్నారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. బాపట్ల జిల్లాలో వై.ఎస్.ఆర్ ఇ. బి.సి నేస్తం క్రింద 26,221 మందికి రూ. 39.28 కోట్లు బటన్ నొక్కి ముఖ్యమంత్రి లబ్ధిదారుల ఖతాలకు జమచేస్తారన్నారు. అనంతరం వై.ఎస్.ఆర్.ఇ. బి.సి నేస్తం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార మార్కెటింగ్ సలహాదారులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేట్ డైరెక్టర్ ఏడుకొండలు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గోలి కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, బి.సి కార్పొరేషన్ పరిపాలనాధికారి నరసింహమూర్తి, మహిళలు పాల్గొన్నారు.

18 ఏళ్ల లోపు పిల్లలకు ఆర్థిక రక్షణకే మిషన్ వాత్సల్య పథకం

విశాలాంధ్ర - జె.పంగులూరు : 18 సంవత్సరాల లోపు వయసు కలిగిన పిల్లలకు ఆర్థికంగా రక్షణ కల్పించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ వాత్సల్య పథకాన్ని నిర్వహిస్తుందని సిడిపిఓ కృష్ణకుమారి అన్నారు. అంగన్‌వాడి సెంటర్ తనిఖీలో భాగంగా బుధవారం పంగులూరులోని ఎస్సీ కాలనీ అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నిరాధారణకు గురై, అవసరతలో ఉన్న బాల, బాలికలకు విద్య, ఆరోగ్యం, అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడేలా ఆర్థికంగా ఆదుకోవటం మిషన్ వాత్సల్య పథక లక్ష్యం అని అన్నారు. అనాధలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లిదండ్రుల దూరమైన వారు, పాక్షిక అనాధలు, విడాకులు తీసుకున్న వారు, కుటుంబాన్ని వదిలేసిన వారు, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధులతో ఉన్నవారు, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం 2015 ప్రకారం, కుటుంబ వాతావరణంలో పెరగటానికి ఒక్కొక్కరికి నాలుగు వేల రూపాయల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దీనికి అర్హులైన వారిని గ్రామమహిళా కార్యదర్శి, అంగన్వాడి కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గుర్తించి పిల్లల వివరాలు కుటుంబ నేపథ్యం, ఆర్థిక, సామాజిక, ఆరోగ్య పరిస్థితులు, పిల్లల చదువు వివరాలను తెలియజేస్తూ దరఖాస్తులు పూర్తి చేసి, ధృవపత్రాలు జతపరిచి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో ఈనెల 15వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు. జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, సంరక్షకుల ఆధార్ కార్డు, మరణ ధ్రువీ కరణ పత్రం, మరణ కారణం, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ ఫోటోలు, ప్రస్తుతం చదువుతున్న స్కూల్ స్టడీ సర్టిఫికేట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం తల్లి/తండ్రి జాయింట్ అకౌంట్ కలిగిన బ్యాంక్ అకౌంట్ వివరాలు జతపరిచిన జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో అప్లికేషన్ ఫారం పూర్తి చేసి అందించాలని తెలియజేశారు. ఈ పథకం చదువుకునే పిల్లలకు మాత్రమే వర్తిస్తుందని, హాస్టల్లో ఉన్నవారికి వర్తించదని తెలిపారు. కార్య క్రమంలో మేదరమెట్ల సూపర్వైజర్ అరుణ, పంగులూరు సూపర్వైజర్ కీర్తిపాటి అన్నమ్మ, స్కూల్ హెడ్మాస్టర్ కంకణాల శ్రీనివాసరావు ఉన్నారు.

డిమాండ్లు పరిష్కరించేంత వరకు ఉద్యమం కొనసాగిస్తాం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతోందని జేఏసీ చైర్మన్ సి.హెచ్.సురేష్ బాబు అన్నారు. ఏపీ జేఏసీ అమరావతి రెండో దశ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జేఏసీ భాగస్వామ్య సంఘాలు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు సంఘం, ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల భాగస్వామ్యంతో జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లా చైర్మన్ సి.హెచ్. సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి టి.రజనీకాంత్,ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు వై.శ్రీనివాసరావు, కో అపరేటివ్ సంఘ అధ్యక్షులు కె.మురళీమోహన్ రెడ్డి నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎమ్.ఎన్.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం డీఎ, పిఆర్సీ అరియర్లు ఇతర ఆర్థిక అంశాలతో పాటు ఆర్థికేతర అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. జీతాలను సకాలంలో ఇవ్వాలని రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో పెన్షన్లు ఆర్థిక సౌకర్యాలను జాప్యం లేకుండా అందించాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ చైర్మన్, ఆప్కో చైర్మన్‌లను సన్మానించిన దారపనేని

విశాలాంధ్ర-పామూరు : స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జయ ప్రకాష్ సాయికు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ బుధవారం డాక్టర్ జయ ప్రకాష్ సాయి, రాష్ట్ర ఆప్కో కార్పొరేషన్ చైర్మన్ చల్లపల్లి మోహన్‌రావులకు విజయవాడలోని తన స్వగృహంలో అల్పాహార విందు ఏర్పాటు చేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జయ ప్రకాష్ సాయిని కొన్ని పంచాయతీలకు అవసరమైన ట్రాక్టర్లు, రిక్షాలు, మరియు కాంట్రాక్ట్ బేసిక్ ద్వారా సిబ్బందికి ఉద్యోగాలు మంజూరు చేయాలని దారపనేని కోరారు. పరిశీలించి మంజూరు చేస్తానని డాక్టర్ జయప్రకాశ్ సాయి చెప్పినట్లు చంద్రశేఖర్ తెలిపారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న'

విశాలాంధ్ర-పామూరు : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత రాంబాబులు అన్నారు. మంగళవారం మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో జగనన్న నువ్వే మా నమ్మకం, జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఇంట సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలిచి 2024 ఎన్నికల్లో వైసిపి పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఇంటింటా సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ జేస్తూ, గత తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలను వివరిస్తూ జగనన్న బొమ్మను గోడలపై అంటించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గంగసాని హుసేన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కో ఆప్షన్ షేక్ కాజా నాయబ్ రసూల్, గట్లా విజయ్ భాస్కర్‌రెడ్డి. జొన్నలగడ్డ గోవిందయ్య పాల్గొన్నారు.

ఎస్సీ పాలెంలో నీటి వసతి

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని బుక్కాపురం ఎస్సీ కాలనీలో నీటి వసతి కల్పించేందుకు టిడిపి ఆధ్వర్యంలో బుధవారం బోరు ఏర్పాటు చేయడం జరిగింది. బుక్కాపురంలో గత ఫిబ్రవరిలో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ కార్యక్రమం జరిగింది. ఎస్సీ కాలనీలో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కాకు గంగయ్య మండల తెలుగుదేశం పార్టీ నాయకులు దృష్టికి తెచ్చారు. మండల టిడిపి నాయకులు కనిగిరి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డికి తెలియ పరిచి వీటి వసతి కల్పనకు కృషి చేశారు. నీటి వసతి కల్పనకు బోరు ఏర్పాటు చేయించిన మాజీ శాసనసభ్యులు, టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహరెడ్డికి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కీ. శే బొల్లా మాల్యాద్రి చౌదరి, మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లుకు బుక్కాపురం గ్రామ టిడిపి అధ్యక్షులు కాకు గంగయ్య, మోరబోయిన రాజేంద్ర, యమ్.వెంకట కొండయ్య, మల్లికార్జున, సరబు కృష్ణ, యమ్. నరసింహులు, యస్.సి పాలెం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

భూసార పరీక్షలతో బహుళ ప్రయోజనాలు

విశాలాంధ్ర-తాళ్లూరు : భూసార పరీక్షలతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని దర్శి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు నిర్మల కుమారి అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద బుధవారం భూసార పరీక్షల నిర్వహణపై అవగాహనతో కూడిన శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు నిర్మల కుమారి మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించడం వల్ల సమస్యాత్మక భూములైన ఆమ్ల, క్షార లక్షణాలు గల భూములను గుర్తించి తగిన యాజమాన్య పద్ధతులు పాటించి దానికి తగిన పంటలు పండే విధంగా చేయవచ్చని ఆమె తెలిపారు.

వివేకానంద విగ్రహ సాధన కమిటీకి రూ.20 వేలు వితరణ

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండల కేంద్రమైన భట్టిప్రోలులో నిర్మితమౌతున్న స్ఫూర్తి ప్రదాతల విగ్రహాల నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. స్ఫూర్తి ప్రదాతల త్యాగాలను భావితరాలకు తెలియజేప్పేందుకు గ్రామానికి చెందిన పలువురు కమిటీగా ఏర్పడి స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద విగ్రహాల నిర్మాణాలను పూర్తి చేస్తున్నారు. వివేకానంద విగ్రహ సాధన కమిటీ చేస్తున్న కృషిలో బాగస్వాములు కావాలన్న సదుద్దేశ్యంతో రూ. 20 వేలు నగదును అందజేసినట్లు స్థానిక తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాల 1976- 77 పదవ తరగతి పూర్వ విద్యార్థులు వెంకటేశ్వరరావు తెలిపారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, బండారు శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా సీతారామిరెడ్డి

విశాలాంధ్ర - కర్లపాలెం : బాపట్ల నియోజకవర్గ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా మండల వైసీపీ కన్వీనర్ దొంతిబోయిన సీతారామిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదవి కోసం ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న సీతారామిరెడ్డికి చైర్మన్ పదవి వరించటంతో పార్టీ నాయకులు, అభిమానులు సీతారామిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపి కేక్‌లు పెట్టారు. సీతారామిరెడ్డి కుటుంబం ఎంపీపీ పదవి ఆశించిన దక్కకపోవటంతో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే కోన రఘుపతి నియమించటం సర్వత్ర హర్షం వ్యక్తమవుతుంది. తనను నమ్ముకున్న వారికి ఎమ్మెల్యే కోన ఎప్పటికైన ఉన్నత పదవులు కట్టబెటతారని మరోసారి రుజువైందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ అధ్యాపకులు కత్తి అంకినీడు, హరిరాజు,అయ్యప్పరెడ్డి, ప్రసాదురెడ్డి, శ్రీనివాసరావులు అభినందనలు తెలిపి స్వీట్లు పెట్టారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

పేదలకు మెరుగైన జీవనం అందించిన సంక్షేమవాది ఎన్టీఆర్

విశాలాంధ్ర-అద్దంకి ; పేదలకు మెరుగైన జీవనాన్ని అందించిన సంక్షేమవాది మాజీ ముఖ్యమంత్రి. తెదేపా వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు అని తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. అద్దంకికి చెందిన నందమూరి కళాపరిషత్ వారు ముద్రించిన ఎన్టీఆర్ శతజయంతి ప్రత్యేక సంచికను బుధవారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగులకు రాజకీయ అవకాశాలను పంచిన సమ సమాజవాది, పేదలకు మెరుగైన జీవనాన్ని అందించిన సంక్షేమవాది, మహిళలకు సమాన హక్కులను కల్పించిన అభ్యుదయవాది నందమూరి తారకరామారావు గారి శతజయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని నందమూరి కళాపరిషత్ సభ్యులను చంద్రబాబు అభినం దించారు. ఆ మహానుభావుని కళాసేవను, ప్రజాసేవను స్మరించుకొని స్ఫూర్తిని పొందుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, నందమూరి కళాపరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు,తెదేపా నాయకులు నాగినేని రామకృష్ణ,కరి పరమేష్, గోవాడ శ్రీకాంత్, చేబ్రోలు సుబ్బయ్య, పరిటాల పవన్, కొల్లి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి పెంపునకు శిక్షణలు దోహదం

విశాలాంధ్ర - నిజాం పట్నం : మత్స్యకార మహి ళలు తమ జీవనోపాధు లను పెంపొందించుకు నేందుకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంత గానో దోహదపడు తాయని ఏపీఎఫ్‌యు బావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.చంద్రశేఖరరావు తెలిపారు. మండలంలోని నిజాంపట్నం - 4 సచివా లయం వద్ద బుధవారం మూడవ రోజు రంగు చేపల పెంపకం, వాటర్ క్వాలిటీ మేనేజ్మెంట్, ఫీడ్ తయారీ విధణము, మార్కెటింగ్ తదితర విషయాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో మత్స్య పర్యావరణ సంసిద్ధతను పెంపొందిం చడానికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను మత్స్యకార మహిళలు సద్వి నియోగం చేసుకొని జీవనోపాధులను పెంపొందించుకోని ఆర్థికాభివృద్ధి చెందాలని చెప్పారు. నిజాంపట్నం ఎఫ్‌డీవో షేక్ కౌసర్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ, గ్రీన్ క్లైమేట్ ఫండ్ వారి ఆర్థిక నిధులతో తీర ప్రాంతంలో మత్స్య పర్యావరణ సంసిద్ధతను పెంపొందించడానికి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన ద్వారా జీవనోపాధిని పెంచుకోవడానికి ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోటు యూనియన్ ప్రెసిడెంట్ కన్నా శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరావు, ఫారెస్ట్ ఆఫీసర్ యు.నాగేశ్వరావు, డీఎఫ్ఎస్ ప్రెసిడెంట్ కన్నా భూశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో జామాయిల్ తోట దగ్ధం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బాపట్ల మండలం అడివి పంచాయతీ పరిధిలోని ముత్తాయపాలెం అటవీశాఖ అభివృద్ధి కేంద్రంలో బుధవారం జామా యిల్ తోటకు నిప్పు అంటు కోవటంతో దగ్ధమైంది. దీంతో మంటలు ఎగసి పడటంతో గుర్తించిన అటవీ శాఖ అధికారులు బాపట్ల అగ్నిమాపక అధికారి వై. వెంకటేశ్వరారావు సమాచారం అందిచటంతో వెంటనే సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటలన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

వృద్ధుల విశ్రాంతి స్థావరం తగలబెట్టిన దుండగులు

విశాలాంధ్ర - యద్దనపూడి : మండల పరిధిలోని గన్నవరం గ్రామంలో సుమారు 50 ఏళ్లుగా చెరువుకట్ట పక్కన వృద్ధులు సేద తీర్చుకొనే విశ్రాంతి స్థావరాన్ని మంగళవారం అర్ధరాత్రి సమ యంలో గుర్తుతెలియని దుండ గులు పూర్తిగా తగులబెట్టారు. ఈ స్థావరం వద్ద గ్రామాల్లోని ఎంతో మంది వృద్ధులకు విశ్రాంతి సమయాలలో, వేసవికాలంలో సేద తీర్చుకోవడానికి ఉపయోగంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. దీనిని గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టడం పూర్తిగా దుశ్చర్య అని, అలాంటి ఆకతాయిలను గుర్తించి శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దానితోపాటు ప్రక్కనే ఉన్న పురాతన చింత చెట్టు కూడా తగలబడి పోవడంతో సర్పంచ్ పల్లె పోగు పోతురాజు, ఉప సర్పంచి చెరుకూరు వేణు,అన్నమ్మ హుటాహుటిన తగలపడుతున్న పెద్ద చింత చెట్టును ప్రక్కనే ఆనుకొని ఉన్న బస్సు సెంటర్ మీద పడకుండా మంటలను ఆర్పి వేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని అలవలపాడు గ్రామంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లో రికార్డులు పరిశీలించి పసిపిల్లలకు, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలకు వ్యాధి నిరోధక టీకాల గురించి పలు సూచనలు చేసి ఆరోగ్య సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ శివ చెన్నయ్య, సూపర్వైజర్ రమాదేవి, సిహెచ్ఓ భారతి, ఏఎన్ఎం శకుంతల, ఎమ్ ఎల్ హెచ్ పి మార్త, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.